# కాలపాశం

-బులుసు-జీ-ప్రకాష్

పాపారావు పేరుకు తగ్గట్టుగా చాలా పాపాలు చేసేడు. మరణించేక యమధర్మరాజు మరుగుతున్న నూనెలో వేసేస్తాడని, నిప్పుల్లో కాల్చేస్తాడని విన్నాడు. అంచేత దీనికి పరిష్కార మార్గం ఏమిటి? అని ఆలోచించాడు. చస్తే కదా యముడు శిక్షించేది? అంచేత చావకుండా ఏదైనా మార్గం అన్వేషించాలని అనుకున్నాడు. ఇంతలో ఒక యతీంద్రుడు ఆ గ్రామానికి వచ్చి అక్కడున్న రామాలయంలో బసచేసేడు. ఆయన దగ్గరకు అనేకులు వెళ్లి ఏకాంతంగా తమ గోడు వినిపించుకుంటున్నారు. సిద్ధపురుషుడైన ఆ యతీంద్రుడు దివ్యదృష్టితో చూసి పరిష్కార మార్గాలు సూచిస్తున్నాడు. అలాగే ఈ పాపాత్ముడు పాపారావు కూడా వెళ్లి తన వేదనను వినిపించుకున్నాడు. యతీంద్రుడు దివ్యదృష్టితో చూసి "నాయనా! నువ్వు ప్రతిదినమూ ఇరవైమూడు గంటలు పాపాలు చేసేవు. ఒక గంట మాత్రమే పుణ్యం చేసేవు. అంచేత నువ్వు ఇరవై మూడు గంటలు నరకం అనుభవించక తప్పదు. ఒక గంట మాత్రం స్వర్గ సుఖం అనుభవిస్తావు. చావు నుండి మాత్రం తప్పించుకోలేవు!" అని చెప్పేడు.

"అయితే నరకం తప్పించుకునే మార్గం లేదా స్వామీ?" అడిగేడు పాపారావు.

"నువ్వు చనిపోయేక యమధర్మరాజు నిన్ను, ముందు ఒక గంటసేపు స్వర్గంలో ఉంటావా? లేక ఇరవైమూడు గంటలు నరకంలో ఉంటావా? అని అడుగుతాడు. నువ్వు స్వర్గంలోనే ముందు ఉంటానని చెప్పు. నేను అక్కడే ఉంటాను" అన్నాడు యతీంద్రుడు.

యమకింకరులు యమలోకానికి తీసికెళ్లేరు పాపారావుని. అనుకున్నట్లే యముడు "నువ్వు ముందు ఒక గంట స్వర్గంలో ఉంటావా? లేక నరకంలోనా?" అని ప్రశ్నించేడు.

"స్వర్గమే!" అన్నాడు పాపారావు.

పాపారావుని స్వర్గానికి తీసికెళ్లగానే, అక్కడే ఉన్న యతీంద్రుడు పాపారావు చుట్టూ ఒక గీత గీసేడు.

"గంట పోయిన తరువాతైనా సరే నువ్వు గీత దాటి బైటకు రాకు. వచ్చేవా నీ పని సరి!" అని హెచ్చరించేడు.

"అలాగే స్వామీ!" అన్నాడు పాపారావు.

యమకింకరులు అవాక్కయి పోయేరు! ఏం చేయాలో తోచలేదు. సిద్ధపురుషుడు గీసిన గీత దాటితే తాము భస్మమై పోతారు! ఈ విషయం తమ ప్రభువైన యమధర్మరాజుకి విన్నవించేరు. పాపారావు చిట్టా విప్పి చూసేడు సమవర్తి. ఈ పాపారావుకి పొడు అలవాటొకటుంది. అదే ముక్కుపొడుం పీల్చడం! ఇది తెలిసిన యమధర్మరాజు తన మహిషం మీద వెళుతూ పొడుంకాయ తీసి, గట్టిగా ఒక పట్టు పట్టేడు. పాపారావుకి ముక్కుపుటాలు ఎగురుతున్నాయి! ఇహ ఓర్చుకోలేకపోయేడు.

"బాబ్బాబూ! ఒక పొడుంపట్టు ఇద్దూ! ఝామై ఛస్తున్నాను!" అంటూ యతీంద్రుడు గీసిన గీత దాటేడు అనుకోకుండా.

"ఛలో నరకానికి!" అంటూ కాలుడు కాలపాశం వేసి లాక్కెళ్లిపోయేడు పాపారావుని.

మనిషికుండే దుర్వ్యసనాలే అతని అకాల మృత్యువుకి హేతువులవుతాయి.

"సంప్రాప్తే సన్నిహితే కాలే
నహి నహి రక్షతి నస్యం వ్యసనే" ■

---

## జీవితం - గణితం

చదువుకున్న
గణిత శాస్త్రాన్ని
జీవితానికి
అన్వయించి చూసుకున్నాను
జీవితంలో
కష్టాలు నష్టాలు
జామెట్రిక్ ప్రోగ్రెషన్‌లో
పెరుగుతాయనీ
సుఖ సంపదలు
అర్థిమెటిక్ ప్రోగ్రెషన్‌లోనూ
పెరగవనీ
తెలుసుకున్నాను.

-తాజీ ప్రసాద్